# 2 వాడిన మల్లెలు

మూర్తి డ్రెస్ చేసుకునేముందు బయటికి చూడలేదు. తీరా డ్రెస్ చేసుకున్నాక కిటికీలోంచి బయటకు చూస్తే బయట సన్నగా తుంపర పడుతోంది. మేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. కాసేపట్లో కుంభ వృష్టి మొదలయ్యేట్టుంది. బయటకు వెళ్తే తడవటం ఖాయం. మూర్తి కుర్చీ కిటికీ దగ్గరకు లాక్కుని కూర్చున్నాడు.

కిటికీ చువ్వలగుండా ఈదురుగాలి కొడుతోంది. ఇందాక పడుతున్న తుంపరపోయి పెద్ద పెద్ద చినుకులే పడుతున్నాయి. ఈపూట బయటికి వెళ్ళి పని చూసుకోవడమంటూ కుదరదు. మూర్తి లేచి గదిలో అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు. ఉన్నట్టుండి అతని దృష్టి టేబిల్‌మీదున్న మల్లెదండ మీద పడింది. రెండు గంటలముందు తను గదిలో చేరుతూ కసవు వూడ్పించాడు. దండ టేబిల్‌మీద వుండటం మూలాన కసవు వూడ్చేవాని దృష్టి నుంచి తప్పిపోయి వుంటుంది.

మూర్తి టేబిల్‌ముందు నిలబడి మల్లెదండని చేతికి తీసుకున్నాడు. దండ వాడిపోయి వుంది. టేబిల్‌మీద రేకులు రాలాయి. అయినా యింకా పరిమళం పూర్తిగా చావలేదు.

అప్రయత్నంగా మూర్తి వూహలు మల్లెదండచుట్టూ ముసురుకున్నాయి. ఎవరో అమ్మాయి రాత్రి ఈ గదిలో గడిపింది. అమ్మాయి ఒక్కర్తే వుండి వుండదు. బహుశా ఆ అమ్మాయి భర్తకూడా వున్నాడేమో! ఇద్దరూ కొత్త దంపతులేమో! తను చూడని ఆ కొత్త దంపతులు తన మనో నేత్రంముందు స్పష్టంగా గోచరిస్తున్నారు. ఏవో తియ్యటి అనుభూతులు గిలిగింతలు పెడుతున్నాయి.

మూర్తి పెదిమలమీద ఒక సన్నటి నవ్వు కదిలింది. తన వూహలు ఎప్పుడూ కొంచెం కాల్పనికంగా వుంటవి. లేకపోతే తను ఇట్లా వూహిం

చడమేమిటి? మల్లెలు పెట్టుకున్నది ఆ అమ్మాయే ఎందుకు అయివుండాలి? వయసుమళ్ళిన స్త్రీ యెందుకు అయివుండకూడదు? అందునా జబ్బుమనిషి ఎందుకు కాకూడదు? ఏ వైద్యం కోసమో వచ్చి ఈ గదిలో వుండటం కూడ సంభవమే.

గది తలుపు తెరుచుకున్నది. హోటలు బోయ్ కూజాతో నీళ్ళు తెచ్చి పెడుతున్నాడు. చప్పున మూర్తికి ఒక ఆలోచన స్ఫురించింది. రాత్రి గదిలో ఎవరు గడిపారో హోటల్ బోయ్‌ని ప్రశ్నిస్తే తేలిపోతుంది. మూర్తికి మళ్ళీ నవ్వు వచ్చింది. ఈ చిన్న విషయానికి పనిగట్టుకొని వాణ్ణి ప్రశ్నించడ మేమిటి? అయినా వాస్తవం కనుక్కోవాలన్న జిజ్ఞాస దేనికి తనకు? వాస్తవం కన్నా వూహలు మధురంగా వుంటవి. వర్షం వెలిసేవరకు ఆ మల్లెదండచుట్టూ తియ్యటి వూహాలోకం సృష్టించుకొని అందులో హాయిగా విహరించవచ్చు. వీలయితే ఆ మల్లెదండ ఆధారంగా ఒక చక్కటి కథ రాసి పడేసినా పడేయవచ్చు. కుక్కపిల్లమీదా, అగ్గిపుల్లమీదా, సబ్బుబిళ్ళమీదా కూడా కథలు వచ్చాయి. మల్లెలు-వాడినవే కావచ్చు. కథావస్తువు కాకపోవడ మేమిటి?

మూర్తి బోయ్‌ని కేకేసి కాఫీకి ఆర్డరిచ్చాడు. సిగరెట్టు ముట్టించి కళ్ళు మూసుకున్నాడు. వర్షం మూలాన బయట బస్సుల రొదలూ, కార్ల రొదలూ ఏమీ లేవు. చినుకుల చిటపటలు తప్ప అంతా ప్రశాంతంగా వుంది. ఒక కప్పు కాఫీ చప్పరిస్తే మూడ్ రావడానికి ఎంతసేపో పట్టదు.

గది తలుపులు కిర్రుమని శబ్దం చేశాయి. మూర్తి విసుగ్గా కళ్ళు తెరిచాడు. వాకిట్లో ఎవరో ఒక యువకుడు నిలబడి ఉన్నాడు. పూర్తిగా తనకు అపరిచితుడు తను కథకుడు గనక ఎందరో అపరిచితులు తన పరి చయంకోసం వస్తుంటారు.

"రండి" అంటూ మూర్తి కుర్చీ చూపించాడు. కూర్చోడానికి సందేహిస్తున్నట్లుంది అతను. కాసేపు తటపటాయించి బెరుకు బెరుగ్గా కుర్చీలో కూర్చున్నాడు. తన్ను చూచి అంత విధేయత ప్రదర్శించిన వాళ్ళు తనకు ఎన్నడూ తగలలేదు.

"మీ పేరు?"

"నాపేరా సార్! రాంగోపాల్ సార్!" అన్నాడు వినయంగా. తర్వాత ఏం మాట్లాడాలో మూర్తికి తోచలేదు. సాధారణంగా అపరిచితుల్ని ఆహ్వానించడం తనవంతు. ఆ తర్వాత సంభాషణ వాళ్ళే మొదలెడుతారు. కాని రాంగోపాల్ ఆ కోవకి చెందినవాడులా కన్పించడం లేదు. బెదురుగొడ్డల్లే తనవైపు చూస్తున్నాడు. కుర్చీలో కుంచించుకపోయి చాలా ఇబ్బందిగా కూర్చున్నాడు. ఆ మనిషితో ఏం మాట్లాడాలో మూర్తికి అంతుపట్టడంలేదు. ఏదోరకంగా సంభాషణ సాగదీయాలి.

"ఈ వూరేనా మీది?"

"అవునుసార్! నేను సరళ తమ్ముణ్ణి సార్. ఆమె మిమ్మల్ని కలుసుకోమంటేనూ"....నీళ్ళు నలుము తున్నాడు.

సరళ! ఎవరీ సరళ? తనకసలు ఆడవాళ్ళతో పరిచయాలే తక్కువ. తన పరిచయస్థుల పరిధిలో సరళ అన్న వ్యక్తి ఎవరూ లేరు. తనకు తెలియని వ్యక్తి తన్ను కనుసుకోమని తమ్ముణ్ణి పంపింది. అంతా ఏదో అయోమయంగా వుంది. మూర్తి ఆశ్చర్యంగా రాంగోపాల్‌వైపు చూచాడు.

రాంగోపాల్ జేబులోనుంచి ఏదో కాగితం తీసి "అప్లికేషన్ రాపి తీసుకొచ్చాను సార్. మా అక్క రాత్రి మీతో మాట్లాడానంది"....తను రాత్రి ట్రెయిన్‌లో వున్నాడు. తనతో ఎవరూ మాట్లాడలేదు. ఏదో పొరపాటు జరిగింది. తన్ను ఎవరో అనుకొని ఏదో మాట్లాడుతున్నాడు.

"నా పేరు మూర్తి. మీరు ఏదో పొరపడ్డట్టున్నారు."

రాంగోపాల్ ముఖం వివర్ణమైంది. రపీమని కుర్చీలోంచి లేచాడు. బలవంతం మీద చిరునవ్వును పెదిమిల మీదికి తెచ్చుకొని "క్షమించండి పొరపాటయింది" అంటూ చర చర బయటికి నడిచాడు.

మూర్తికి ఎక్కడలేని జుగుప్సా కలిగింది. అనవసరంగా తన మూడ్ పాడుచేశాడు. మూర్తి మళ్ళీ సిగరెట్టు ముట్టించాడు. బోయ్ కాఫీ పట్టుకొచ్చాడు. కొంచెం కాఫీ చప్పరించగానే మొదట్లో ఏదో ఆలోచన తళుక్కుమంది. వెళ్తున్న బోయ్‌ని పిలిచాడు.

"రాత్రి ఎవరున్నారు ఈ గదిలో?"

తను ఎందుకు వాకబు చేస్తున్నాడో బోయ్‌కి అర్థంకాలేదు. ఆశ్చర్యంగా తనవైపు చూచాడు.

"మీకన్నా ముందుగా ఈగదిలో డైరెక్టర్ వున్నాడు సార్" అన్నాడు.

"సినిమా డైరెక్టరా?"

బోయ్ లేదన్నట్లు తలతిప్పి 'కాదుసార్ ఏదో ఆఫీసు డైరెక్టరు. ఆఫీస్ పేరు....వుండండి చెబుతాను.' అని జ్ఞాపకం చేసుకోవడానికి తల గోక్కుంటున్నాడు.

రాష్ట్రంలో సవాలక్ష శాఖలున్నవి. అర్థ గణాంకశాఖ, జనాభా సేకరణశాఖ, పశుజనాభివృద్ధిశాఖ, స్త్రీ సంక్షేమశాఖ, శిశుసంక్షేమశాఖ వన్యమృగ సంక్షేమశాఖ యింకా నానా శాఖలున్నవి. ఏ శాఖకో ఒక శాఖకు డైరెక్టరు అయివుంటాడు. తనకు కావలసిన విషయం అదికాదు.

'రాత్రి ఒక్కడే వున్నాడా ఆయన ఈ గదిలో?'

'ఇక్కడ దిగడమేమో ఒక్కడే దిగాడు సార్. రాత్రి ఎవరో ఒకామె వచ్చి మళ్ళీ తెల్లారగట్లకే వెళ్ళిందిసార్' అంటూ బోయ్ పళ్ళు యికిలించేడు.

తనవూహ కరక్టే. సందేహంలేదు. ఆవిడ సరళ! మూర్తి టేబిల్ వైపు చూచాడు. తన కథావస్తువు వాడిన మల్లెదండ యింకా అట్లాగే వున్నది. మూర్తి బరువుగా నిట్టూర్చి మరో సిగరెట్టు వెలిగించేడు. సిగరెట్టు పొగల మధ్య కాసేపు పరిచయమున్న రాంగోపాల్ బొత్తిగా పరిచయంలేని సరళ, డైరెక్టరు అంతా క్షణంలో రూపు దిద్దుకున్నారు. కాగితాలు తీసి చకచకా కథ రాయడానికి ప్రారంభించాడు.

—:o:—